సమస్యలతో సహవాసం

- జగనన్న కాలనీలో పలు సమస్యలతో సతమతం
- కనీస వసతులు కరువై ప్రజలకు ఇబ్బందులు
- రహదారులు, డ్రెయిన్‌లు లేక నివాసాల మధ్య నిలిచిపోతున్న నీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు





అధ్వానంగా ఉన్న రహదారులు

రేపల్లె: అభివృద్ధి, సంక్షేమం తమ ధ్యేయమంటూ ఆర్భాటంగా ప్రకటిస్తున్న కూటమి ప్రభుత్వ హామీలు అమలుకు నోచుకోవటం లేదు. అభివృద్ధి సంక్షేమాన్ని పక్కన పెడితే ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం, పాలకులు తీవ్రంగా విఫలం అవుతున్నారు. కూటమి ప్రభుత్వం పాలకపగ్గాలు చేపట్టి సంవత్సరం కావస్తున్న ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. దీంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన రేపల్లె పట్టణంలోని జగనన్న కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. కాలనీలో సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో వర్షపు నీరు, గృహాలలో వాడిన మురుగునీరు బయటకు పోయే దారి లేక నివాస గృహాల మధ్య రోజుల తరబడి తిష్ట వేస్తుంది. నీటి నిల్వలు పేరుకుపోవడంతో అంటు వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు నివేశన స్థలాలు అందించి ఇంటి నిర్మాణానికి ఆర్థిక చేయూతను అందించింది. దీనిలో భాగంగా రేపల్లె పట్టణంలోని 18వ వార్డు సమీపంలో 63 ఎకరాలలో 3,009 మంది నిరుపేదలకు నివేశన స్థలాలు అందించి గృహ నిర్మాణాలకు చేయూతను అందించడంతో ఎన్నికల నాటికి 1,250 మందికి పైగా గృహాలను నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైన నాటికి ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి.


- ఎన్నికల అనంతరం అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీ అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తుంది. దీంతో కాలనీవాసులు వసతులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణం పూర్తి చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన జమ్మిగడ్డి, పిచ్చి మొక్కలు

మరమ్మతు చేయించరు.. సరఫరా చేయరు

తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన 17 బోర్లలో ఆరు బోర్లు మరమ్మతులకు గురవటంతో నీటి సరఫరా పలుచోట్ల ఆగిపోయింది. దీంతో నీటి కోసం కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. బోర్లను మరమ్మతు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించాలని గత నెలరోజుల నుంచి కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. బోర్లు మరమ్మతులు చేయించేలోగా ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేయించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.



బోర్లు మరమ్మతులకు గురికావడంతో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

సమస్యలను పరిష్కరిస్తాం

జగనన్న కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. కాలనీలో మరమ్మతులకు గురైన బోర్లను ఇప్పటికే బాగు చేయించాం. కాలనీలో అవసరం మేరకు టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా అధికారులను ఆదేశించాం. రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు సంబంధించి సమస్యను ప్రభుత్వానికి నివేదించాం.

– సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

31న భూమి కౌలుకు బహిరంగ వేలం

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో వేంచేసియున్న బసవేశ్వర దేవస్థానంలో శనివారం 31వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు భూమి కౌలుకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం పరిధిలో 4 ఎకరాల 42 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని మూడు సంవత్సరాలు కౌలుకు చేసుకొనే హక్కు బహిరంగ వేలం ద్వారా కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పొలం కౌలుకు పాడే రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన చెప్పారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అనేక ప్రధాన కాల్వలను పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు రోడ్లపై నిలవకుండా చూడాలన్నారు. అలాగే ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సునీల్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.


నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 15,16 వార్డులలో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వలను బాగు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గుంటూరు కోటేశ్వరరావు, దివి అనిత, టీపీవో సాంబశివరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



తెనాలిఅర్బన్: నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం ఆయన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధపడుతూ ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన 14 మందికి రూ.16.45లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 134 మందికి రూ.1.78కోట్ల విలువ చేసే చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. అవసరమైన వారు సీఎంఆర్‌ఎఫ్ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు.

వైభవంగా హనుమజ్జయంతి మహోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మూలమూర్తికి అభిషేకం, అలంకారాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామికి లక్ష తమలపాకుల పూజ, నివేదన, నీరాజనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి గద్దె వెంకట అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

ఆక్రమణలను పరిశీలించిన తహసీల్దార్



తెనాలిరూరల్: పట్టణంలో ఆక్రమణలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. స్థానిక పాండురంగ పేట, ఇందిరానగర్ కాలనీలో ఆయన బుధవారం పర్యటించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 17న పట్టణంలో పర్యటించిన నేపథ్యంలో ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశం స్థానికులు పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు తహశీల్దార్ బుధవారం పట్టణంలో పర్యటించి ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు అనుకూలమైన ప్రదేశాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఎంతకాలంగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు, వారి వద్ద ఉన్న ఆధారాలు, వారు ఆక్రమించిన ప్రాంతం ప్రభుత్వానికి భవిష్యత్తులో ఏదైనా అవసరమా, ఇబ్బందికరమా అనే అంశాలను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌వోలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

పెదకాకాని: విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. పెదకాకాని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా 24వ రోజు విద్యార్థులకు స్టోరీ రీడింగ్, టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన, ఆటల పోటీలు నిర్వహించారు. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు ఈ సమ్మర్ క్యాంపులు దోహదపడతాయన్నారు. రికార్డులను పరిశీలించి, క్యాంపుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



చెరుకుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చేందుకు శక్తి సామర్థ్యాల్లేకే నెల నెల ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. బుధవారం గుళ్లపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారాల్లో కరెంటు బిల్లులు ఒక్క రూపాయి కూడా పెంచను, అవసరమైతే ఇంకా తగ్గించి నాణ్యమైన విద్యుత్ అందిస్తాము.. కానీ ఎట్టి పరిస్థితుల్లో పేదలపై భారం పడనివ్వనంటూ హామీ ఇచ్చి తీరా అధికారం వచ్చిన తరువాత ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ప్రతి నెల విద్యుత్ బిల్లులు సర్ చార్జీలు పెంచుకుంటూపోతు ప్రజలను దగా చేశాడని డాక్టర్ గణేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉండేవారికి అద్దె కన్నా కరెంటు చార్జీలు అధికంగా వస్తున్నాయని దీంతో విద్యుత్ చార్జీలు సామాన్యుడికి భారంగా మారాయని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన దాదాపు సంవత్సర కాలంలోనే వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపి నిలువున మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజలపై ఒక్క రూపాయి భారం పడకుండా 40 సంవత్సరాల రాజకీయ అనుభవంతో రాష్ట్రంలో సంపద సృష్టిస్తానన్న పెద్ద మనిషి వరసగా ఒక్కొక్కటిగా చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్నారని దీన్ని ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని డాక్టర్ గణేష్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడిచిన ఐదు సంవత్సరాల్లో క్యాలెండర్ ప్రకారం ప్రతి నెల ఏదొక పథకాన్ని అందజేస్తూ ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారని, ఎన్నికల హామీలను మేనిఫెస్టోలో 95 శాతం అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు మరవరానివి

తెనాలిఅర్బన్: దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవరానివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సాంబశివుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా ఆయన దేశంలో అనేక నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పేదల సంక్షేమానికి ఆయన పాటుపడ్డారని కొనియాడారు. ఆయన బాటలో అందరు నడవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, గుర్రపు ద్వారక శ్రీనివాసరావు, కర్లపూడి బుల్లియ్య, పెనుకొండ శివకుమార్, భీమ రమేష్, పినపాటి స్టీవెన్ బాబు, శంకరరావు, కోటేశ్వరరావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళి

ప్రారంభమైన శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కొలువైన వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షించారు. గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకార్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన, హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతాయని శ్రీనివాస శర్మ తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్ర నామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలి

సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



మాట్లాడుతున్న సంజనా సింహ

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా వ్యవహరించాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ స్పష్టంగాచేశారు. ప్రాథమిక బాధ్యతలను గుర్తుంచుకొని వ్యవహరించాలని చెప్పారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సదస్సుకు సబ్‌కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల్లో ఇప్పుడు చాలా చైతన్యం వచ్చిందనీ, కొందరిలో సహనం కూడా తగ్గిపోతోందని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఎవరైనా వెళ్లినపుడు తమను పట్టించుకోలేదని చెప్పినప్పుడు ఇబ్బందులు తప్పవన్నారు. నియోజకవర్గాల్లో పర్యటించినపుడు ప్రజల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ రావాలనేది రాజకీయ నాయకుల భావనగా గుర్తుచేశారు. సచివాలయ ఉద్యోగుల వ్యవహారశైలి మారాల్సి ఉందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజల సమస్యలు, కష్టాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, తమ పరిధిలోనివి అయితే పరిష్కరించటం, అంతకు మించినవైతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. చాలామంది ప్రజలు సచివాలయం సిబ్బందిని చూడలేదంటున్నారని చెబుతూ 'మీరే మాకు కళ్లూ చెవులూ కాకుంటే ఎలా' అంటూ ప్రశ్నించారు. విధుల పట్ల బాధ్యతగా ఉంటూ ప్రజలతో సానుభూతిగా వ్యవహరించాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు జాబ్‌చార్ట్‌తో పాటు ప్రభుత్వం అదనంగా ఇచ్చే విధులను తప్పనిసరిగా నిర్వర్తించాలని స్పష్టంగా చెప్పారు.

మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మసలుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తన ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన సర్వేలకు వెళ్లినపుడు సమస్యలు కూడా తెలుసుకుంటే సానుకూల స్పందన వస్తుందని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, సచివాలయ ఉద్యోగులు రాజ్‌కుమార్, ప్రశాంతి, తిరుపతిరావు తదితరులు మాట్లాడారు.

గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టాలి



పొన్నూరు: ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో హౌసింగ్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ షేక్.జానీబాష మాట్లాడుతూ.. మండలంలో 380 మంది లబ్ధిదారులలో ఇప్పటి వరకు 147 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని తహసీల్దార్ ఆదేశించారు. వీఆర్వోలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విధుల్లో అలసత్వం వీడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకానిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం





చినరావూరు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికి జలమయం అవుతుంది. బుధవారం ఉదయం కొద్దిసేపు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పార్కు ప్రక్క రోడ్డుతో పాటు రైల్వే స్టేషన్, తోటకు వెళ్ళే రోడ్డులు జలమయం అయ్యాయి. దీనికి కారణం రహదారులు పల్లంలో ఉండటమే. ఈరోడ్లపై చినరావూరులో నివశించే వారు కాకుండా జగ్గడిగుంటపాలెం, పెదరావూరు గ్రామ ప్రజలు కొందరు వెళ్తుంటారు. వర్షం పడితే నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. -తెనాలిఅర్బన్

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి పవళింపుసేవ



పాల్గొన్న భక్తులు

తెనాలి: పట్టణంలో చిన్నతిరుపతిగా ప్రసిద్ధి చెందిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఏడురోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం రాత్రి ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షిణములు చేశారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఏకాంతసేవను నిర్వహించారు. ఉదయం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించారు. ఆలయ అర్చకులు కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని హాఫ్‌పేట గ్రామానికి చెందిన కోటయ్య(44) 19వ తేదీ రాత్రి తన ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మధ్య రాత్రిలో కాలకృత్యాలకు లేచి దిగుతూ మెట్ల నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కె.ఆనంద్ బుధవారం తెలిపారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయస్వామి 16వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజైన బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో 1108 అరటి పళ్లతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర అర్చన, హారతి, మంత్రపుష్పం చేశారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాధం రాజేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. హనుమజ్జయంతి రోజైన గురువారం మామిడి ఫలార్చన జరుగుతుందని, బాలస్వామీజీ పుష్కర నీటిని భక్తులకు అందజేస్తారని తెలిపారు.